ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

**Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.**

**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60**

# జీవిత మథనమే 'సంస్కారం'

**డా. బండారి ప్రేమ్ కుమార్**

తెలుగు సహాయ ఆచార్యులు

తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల

బొగ్గులకుంట, హైదరాబాదు.

**పరిచయం;** కన్నడ రచయిత యు. ఆర్. అనంతమూర్తి రాసిన కన్నడ నవల 'సంస్కార' ను తెలుగు లో రచయిత్రి సుజాత పట్వారి గారు సంస్కారం అనే పేరుతో అనువదించారు.ఈ నవల లో కన్నడ ప్రాంత బ్రాహ్మణుల సంస్కృతి , ఆచార వ్యవహారాలు, సామాజిక స్థితి గతులు ఆవిష్కరించబడ్డాయి. అనువాద సాహిత్యం ద్వారా , విభిన్న ప్రాంతాల సాహిత్యాన్ని తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆయా ప్రాంతాల సాహిత్యాన్ని తులనాత్మకంగా పరిశీలించడానికి, సాహిత్యపు విలువల్ని, ప్రమాణాల్ని సరిచూసుకోవడానికి అనువాద సాహిత్యం ఉపయోగపడుతుంది.

**కీలక పదాలు;** సాహిత్యం, నవల, అనువాదం, అంతర్మథనం, సామాజిక ప్రయోజనం, సంస్కారం.

**ఉద్దేశ్యం;** సంస్కార అనే కన్నడ నవలకు మూల రచయిత యు. ఆర్ .అనంతమూర్తి. తెలుగులో సంస్కారం అనే పేరుతో అనువాదం చేసిన రచయిత్రి సుజాత పట్వారి. రచయితలు ఇద్దరు బ్రాహ్మణ వర్గానికి చెందినవారు. బ్రాహ్మణుల సామాజిక స్థితిగతులను ఒకవైపు నవలలో ఆవిష్కరిస్తూనే, మరోవైపు కథానుగుణంగా సందర్భానికి తగ్గట్టుగా మారే పాత్రల మనోవైకల్యాల్ని రచయిత ఎండగట్టారు. వాస్తవిక పరిస్థితులను తెలియజేస్తూ మానవీయత లోపించిన వైనాన్ని ఆయా పాత్రల ద్వారా తెలియజేశారు.

వర్గం ఏదైనా గాని, మానవీయ విలువలతో జీవించడమే ప్రధానమని, వ్యక్తిత్వాన్ని సరి చేసుకోవడమే సంస్కారం అని ఈ నవల తెలియజేస్తుంది. వ్యక్తిలో అంతర్మథనం మొదలైతేనే అసలైన వ్యక్తిత్వం రూపు కట్టి సంస్కారవంతులు అవుతారు. అది నెరవేరితే రచయిత ఉద్దేశం ప్రకారం, తన రచనకు సామాజిక ప్రయోజనం చేకూరినట్లు అవుతుంది.

**పరిశోధన పద్ధతులు;** అనువాద సాహిత్యం గూర్చి తెలుసుకోవాలనే ఆసక్తితో , తెలుగులో వచ్చిన అనువాద రచనల్ని అధ్యయనం చేశాను. అధ్యయనం చేస్తున్న క్రమంలో భిన్న ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలను గూర్చి తెలుసుకోవాలనే ఉత్సుకత నాలో కలిగింది.అధ్యయనంలో భాగంగా సంస్కారం అనే శీర్షికతో వచ్చిన నవలను చదివాను. ఈ నవల కన్నడంలో సంస్కార అనే పేరుతో యు. ఆర్. అనంత మూర్తి గారు రచించారు. ఈ కన్నడ నవలను ప్రముఖ రచయిత్రి సుజాత పట్వారి గారు తెలుగులో సంస్కార అనే పేరుతో అనువదించిన తీరు బాగుంది. కన్నడ మూలం, తెలుగు అనువాదాన్ని తులనాత్మకంగా పరిశీలించి, విషయ విశ్లేషణాత్మక పద్ధతిలో, నా పరిశోధనలో వెలువడిన కోణాల్ని ఈ పరిశోధన పత్రంలో పొందుపరిచాను.

సాహిత్యంలో విస్తృతంగా మారుతున్న పాఠకుల అభిరుచికి అనుగుణంగా విభిన్నమైన ప్రక్రియలు ఎన్నో పుట్టుకు వస్తున్నాయి. ప్రతి ప్రక్రియ దేనికదే విశిష్టమైనది. భారతదేశం విభిన్నమైన జాతి, మత, కుల, సంస్కృతులకు పుట్టినిల్లు. సాహిత్యం అందులో అంతర్భాగం. సాహిత్యం ద్వారా విభిన్న ప్రాంతాల అస్తిత్వాన్ని తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఆయా ప్రాంతాల సామాజిక స్థితిగతులను అవగాహన చేసుకుని, సామాజిక స్పృహతో వ్యవహరించడానికి సాహిత్యం వారధిగా

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60

పనిచేస్తుంది. సృజనాత్మక సాహిత్యం సమాజానికి ఏ విధంగా అయితే దిశానిర్దేశం చేస్తుందో? అంతకంటే విస్తృతంగా సామాజిక చైతన్యం వెల్లివిరియడంలో అనువాద సాహిత్యం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రాంతీయ భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి అనువాదం ఎంతగానో ఉపయోగపడుతుంది. భాష ప్రధాన సమస్యగా మారినప్పుడు, అనువాదం అనేది గొప్ప సాధనంగా, ఇతర భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని అమూలాగ్రంగా తెలుసుకునేందుకు ఉపయోగ పడుతుంది. ఆయా భాషల్లో వచ్చిన సాహిత్యం పై అభిరుచిని, అవగాహనను పెంచుకోవడానికి పాఠకులకు చక్కగా ఉపయోగపడుతుంది.

సాహిత్యాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడంలో, పాఠకుల్లో ఆదరణను, సాహిత్య అభిలాషను పెంపొందించడంలో అనువాదం పాత్ర ఎంతో కీలకం. అనువాద రచయిత్రిగా ప్రస్థానం మొదలుపెట్టిన రచయిత్రుల్లో, సుజాత పట్వారి గారిని ప్రముఖంగా పేర్కొనవచ్చు. సుజాత పట్వారి గారు ఆంగ్ల సాహిత్యంలో M.A చేసి, ఆంగ్ల అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. వృత్తి రీత్యా ఆంగ్ల అధ్యాపకత్వాన్ని నిర్వహిస్తూనే, ప్రవృత్తి రీత్యా రచనా రంగంలో అడుగుపెట్టారు. స్వీయ రచనలతో పాటుగా, మంచి విలువలను బోధించే సాహిత్యం ఏదైనా పాఠకులకు అందజేయాలనే సదుద్దేశంతో అనువాద రంగంలో అడుగు పెట్టారు. సుజాత పట్వారి గారి మాతృభాష కన్నడం కావడం, వ్యవహారిక భాష తెలుగు అవ్వటం, ఉపాధి భాష ఆంగ్లం కాబట్టి ఈ మూడు భాషలపై మంచి పట్టు ఉండడంతో ఆయా భాషల్లోని సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి అనువాదం చేయటం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

సుజాత పట్వారి గారి అనువాదాల్లో ప్రధానంగా చెప్పుకోదగినది, కన్నడ నవలా సాహిత్యంలో విమర్శకుల దృష్టిలో, వివాదాలకు తెరతీసి, అంతిమంగా విమర్శకుల దృష్టిలో ప్రశంసలు దక్కించుకున్న సంస్కార నవలను ప్రధానంగా పేర్కొనవచ్చును. రచయిత్రి కర్ణాటక ప్రాంతంలోని బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆనాటి బ్రాహ్మణుల ఆచార వ్యవహారాలు, సంస్కృతిలో తాను చూసిన, అనుభవైకవేద్యమైన జీవితంలోని కొన్ని సంఘటనలను, జోడించి ఈ నవల అనువాదం చేశారు. ఆ సామాజిక వాతావరణాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు కాబట్టే, ఆ ప్రాంతంలోని బ్రాహ్మణుల సంస్కృతి, సంప్రదాయాలను తెలుగు ప్రజలకి తెలియజేయాలనే లక్ష్యంతో కన్నడ నవల '**సంస్కార**' ను తెలుగు భాషలో సంస్కారం అనే పేరుతో, మూలానికి ఎటువంటి భంగం కలిగించకుండా యధాతధంగా అనువాదం చేశారు. రచయిత్రి చేసిన అనువాదం చాలా సరళంగా, ఎంతో అర్థవంతంగా, భావం దెబ్బతినకుండా, ఎంతో ఔచిత్యవంతంగా ఉంది. తెలుగు పాఠకులను చదివించడంలో, నవలపై ఆసక్తిని కలిగించడంలో సుజాత పట్వారి గారు చేసిన అనువాదం బాగుంది. కన్నడ రచయిత యు.ఆర్. అనంతమూర్తి గారు కన్నడంలో రాసిన సంస్కార అనే నవలను యధాతధంగా అనువాదం చేయడమే సుజాత పట్వారి గారి లక్ష్యం. కాబట్టి కన్నడ మూలంలో దొర్లిన కొన్ని తప్పులను రచయిత్రి సవరించలేదు. కథనంలోని వ్యాఖ్యానాల దృష్ట్యా పరిశీలిస్తే, కథను సర్వసాక్షి ప్రథమపురుష దృష్టి కోణంలో మొదలుపెట్టి, అంతలోనే ఉత్తమపురుష దృష్టి కోణంలోకి వస్తాడు. అసలు పాఠకులకు కథను ఎవరు చెబుతున్నారు? అనే విషయంలో అస్పష్టత కలుగుతుంది. స్పష్టత లేని కథనం వల్ల, పాఠకుల్లో రచన పట్ల ఆసక్తి లోపిస్తుంది. కాబట్టి మూల రచయిత ఈ లోపాలను సరిచేసుకుంటే బాగుండేది.

యు.ఆర్.అనంతమూర్తి గారు కన్నడ రచయిత. మైసూర్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్ గా పని చేశారు. 1994లో కన్నడ సాహిత్యంలో చేసిన సేవలకుగాను అత్యున్నతమైన, ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ పురస్కారం అందుకున్నారు. పద్మభూషణ్ వంటి ఎన్నో విశిష్టమైన పురస్కారాలను పొందారు. యు.ఆర్. అనంతమూర్తి గారు సంస్కార అనే కన్నడ నవలను 1965లో రాశారు. ఈ నవల ఎన్నో విమర్శలకు గురై, 1970లో జాతీయస్థాయిలో ఉత్తమ చలనచిత్రంగా ఎంపిక అయింది. ఈ కన్నడ చిత్రానికి ప్రముఖ తెలుగు కవి తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి గారు దర్శకత్వం వహించారు.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60

రచయిత యు. ఆర్. అనంతమూర్తి కర్ణాటక రాష్ట్రంలోని బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన వారు కాబట్టి, బ్రాహ్మణ సంస్కృతి, సంప్రదాయాలను, అగ్రహారికుల జీవనశైలిని ఎంతో వాస్తవికంగా తెలియజేశారు. బ్రాహ్మణుల్లో వేళ్ళూనుకుని ఉన్న, మూఢవిశ్వాసాల్ని, చాందస భావాలను ఈ నవలలో ఎంతో నిర్భయంగా, బాహాటంగా రచయిత తెలియజేశారు. సంస్కారం అనే పదం, ఈ నవల ముగింపుకు చేరుకునే వరకు, పాఠకులను వెంటాడుతూనే ఉంటుంది. అసలు సంస్కారం అంటే ఏమిటి? ఈ నవలా శీర్షిక లక్ష్యం, ముగింపులో నెరవేరిందా? అనే ప్రశ్నలను పాఠకుల్లో రేకెత్తిస్తూ, సమాధానాన్ని వెతుక్కునేలా నవల పరుగులు తీస్తుంది.

సంస్కారం అనేది మనిషి ప్రవర్తనకు, అతని వ్యక్తిత్వానికి సంబంధించిన పదంగా మనం ఆపాదించి చెప్పుకుంటాం. ఇక్కడ సంస్కారం అనేది, నవలలో అంతర్భాగంగా ప్రస్తావిస్తే, రెండు అర్థాలను సమన్వయపరుస్తూ, కథనం నడుస్తుంది. సంస్కారం అనేది ఒక వ్యక్తికి నిర్వహించే షోడశకర్మల్లో భాగంగా పేర్కొనే, చావుకు సంబంధించిన దహన సంస్కారం అనే అర్థాన్ని కూడా స్ఫురింప చేస్తూ కథనం నడుస్తుంది. కథ ప్రారంభం, కథలో ముఖ్య పాత్రధారి అయిన 'నారాయణప్ప' చావుతో మొదలవుతుంది. నారాయణప్ప చావు, అతని దహన సంస్కారం చుట్టూనే కథ అంతా నడుస్తుంది. ఈ సంఘటనను ఆధారంగా చేసుకునే ఎన్నో పాత్రలు ఆవిష్కృతమవుతాయి. ఈ నవలలో పాత్రలు విస్తృతంగా ఉన్నాయి. కథా స్థలాలు కూడా కర్ణాటక ప్రాంతంలోని కొన్ని అగ్రహారాలను రచయిత ఎన్నుకున్నారు. నవల అంతా నాటకంలోని అంకాల విభజనల మాదిరిగా అధ్యాయాలుగా విభజించడం జరిగింది. నారాయణప్ప చావు ద్వారా ఆగ్రహారకుల జీవనశైలి, వారి మనోవృత్తులు తెలుస్తాయి. కులం, మతం వంటి భేషజాలు అవసరాన్ని బట్టి ఎలా మారుతాయో? కళ్లకు కట్టినట్లు రచయిత తెలియజేశారు. ఒంటరిగా ఉన్నప్పుడు మనం ఎలా వ్యవహరిస్తామో? అదే మన నిజమైన వ్యక్తిత్వం అంటూ.. ఈ నవలా రచయిత స్పష్టం చేశారు. ఈ నవలలో ఎన్నో కోణాలు చర్చించబడ్డాయి. పాఠకుల్లో ఎన్నో ప్రశ్నలు లేవనెత్తుతూ.. వారిని ఆలోచనల్లోకి తీసుకువెళతాయి.

కుల వివక్ష ఏ సమాజంలో అయినా ఉంది. వివక్ష అనేది ఒక వర్గానికో, ఏ ఒక్క కులానికో ఆపాదించి చెప్పడం అనేది సరైనది కాదు. అగ్రవర్ణాలుగా పేర్కొనబడిన బ్రాహ్మణుల్లో కూడా కులవివక్ష ఉంటుంది అని చెబుతూ, అది రూపుమాపాలంటే, వ్యక్తిగత మార్పుతోనే సాధ్యం అని రచయిత ప్రస్తావించారు. అంటరానితనం, కుల వ్యవస్థ, మూఢవిశ్వాసాలు, వేశ్య వ్యవస్థ వంటి ఎన్నో సామాజిక సమస్యలను నవలల్లో, కథానుగుణంగా కొన్ని సంఘటనలను జోడిస్తూ, 1965 నాటి కర్ణాటక సామాజిక స్థితిగతులను ఎంతో వాస్తవికంగా రచయిత చిత్రించారు.

ఈ నవలలో ప్రధాన కథానాయకుడు ప్రాణేశాచార్య. అతను తన జీవిత గమనంలో, ఆదర్శ సిద్ధాంతాలకు లోబడాలా? తనకు నచ్చినట్లు జీవించాలా? అనే మీమాంశతో కథ నడుస్తుంటుంది. ప్రాణేశాచార్య తనని తాను వెతుక్కునే ప్రయత్నంలో, అతనిలో అంతర్మథనం మొదలవుతుంది. నిజమైన వ్యక్తిత్వం ఆవిష్కరించబడి, అతడు ఏ వైపుకు అడుగులు వేస్తాడు? అనే ఉత్కంఠతను రేకెత్తించే వాక్యాలతో నవల ముగుస్తుంది. కథ ప్రారంభం నుంచి ముగింపు వరకు జరిగిన కొన్ని సంఘటనలను విశ్లేషించుకుంటే, ఆయా పాత్రల తీరు తెన్నులతో పాటు ఆనాటి సమాజాన్ని అర్థం చేసుకోగలుగుతాం.

చంద్రి వేశ్య అయినప్పటికీ ఔదార్యంతో, తనకు నారాయణప్పకు గల బంధానికి విలువను ఇచ్చి, మానవతా విలువలు ఉన్న స్త్రీకి నిదర్శనంగా నిలుస్తుంది. నారాయణప్ప బంధువులు గరుడాచారి, సీతమ్మ, లక్ష్మణాచారి, అనసూయమ్మలు ససేమిరా దహన సంస్కారాలకు ముందుకు రారు. చంద్రి ఎప్పుడైతే బంగారు ఆభరణాలను ఫణంగా పెట్టిందో? అప్పుడు వారి మానసిక ప్రవృత్తులకు సంబంధించిన సంఘటన విశ్లేషించుకుంటే..

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60

**"వాడు బ్రాహ్మణీకాన్నీ వదిలిన, వాణ్ని బ్రాహ్మణీకం వదిననట్లు కాదు కదా. వాన్ని మనం వెలివేయలేము కదా" (పుట : 27)** అని గరుడాచారి అన్నాడు.

చంద్రి త్యాగం చేసిన బంగారం మీద వ్యామోహంతో గరుడాచారి మాట తీరు మారింది. అక్కడ ఉన్న వారంతా బంగారం మీద ఆశతో దహన సంస్కారాలు చేయడానికి అవకాశం లభిస్తే బాగుండని, మనసులో దురాలోచన చేస్తున్నారు. అవసరాన్ని బట్టి మారే మనుషుల ప్రవర్తన తీరు, తెన్నులు ఎంతో స్పష్టంగా కనిపిస్తాయి. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడి ఉంటాయనే వాస్తవం తెలుస్తుంది. అలాంటి సందర్భాల్లో కులం, జాతి, మతం వంటి భేషజాలు కూడా పక్కన పెడతారు. బ్రాహ్మణుల్లో శాఖలు అయినా మధ్వ బ్రాహ్మణులు, స్మార్త బ్రాహ్మణుల మధ్య ఆధిపత్యం కోసం పోరాటం కనిపిస్తుంది. బ్రాహ్మణత్వమే జీవనాధారం అయిన పేద బ్రాహ్మణులది మరో పోరాటం. అటు రెండు శాఖల మధ్య నలిగిపోతూ, అస్తిత్వం కోసం నానా పాట్లు పడే బ్రాహ్మణుని పాత్రలో దాసాచార్యులు కనిపిస్తారు.

**"మీరేమో వారు అడ్డబొట్లు వారని తెలుసుకున్నా, వారు మాత్రం తాము మీ కంటే తక్కువవాళ్ళని అనుకోవడం లేదు. మీ వాడు శవాన్ని దహనం చేస్తే, మీ కులమెంత పోతుందో? వారి కులము అంతే పోతుంది." (పుట : 11)** అని దుర్గ భట్టు అన్నాడు. ఈ సంఘటన ద్వారా బ్రాహ్మణుల్లో గల వివక్ష కనిపిస్తుంది. ఎవరి అస్తిత్వాన్ని వారు కాపాడుకోవాలి అదే ప్రధానం అన్నట్టుగా, మానవీయతను కూడా లెక్క చేయని వారి కర్కశత్వం కన్పిస్తుంది. బంగారంపై వ్యామోహంతో గరుడాచారి భార్య అనసూయ, ఆ బంగారం నారాయణప్ప భార్య అంటే, చనిపోయిన తన చెల్లెలికి చెందాల్సిందంటూ వాపోతూ ఉంటుంది. బంగారం కళ్ళ ముందు కనిపించక ముందు, నారాయణప్ప దహన సంస్కారాల బాధ్యత మాత్రం తమదే అన్న విషయం గాని, తన చెల్లెలి భర్త నారాయణప్ప అన్న విషయం గాని, మాట్లాడకపోవడం బట్టి చూస్తే, ధన వ్యామోహం అనేది బంధాలు, బంధుత్వాలను తెంచేస్తున్న వైనం కనిపిస్తుంది. స్త్రీలలో కూడా కాఠిన్యం తొంగి చూస్తున్న తీరు ప్రస్ఫుటమవుతుంది.

**"స్వరం చూస్తే నారాయణప్ప ఉంపుడుగత్తె చంద్రి లా ఉంది. ఆమెతో మాట్లాడితే మళ్ళీ స్నానం చేసి, భోజనం చేయాల్సి ఉంటుంది" ( పుట: 2)**

ఈ సంఘటనను విశ్లేషించుకుంటే ఒకవైపు బహిర్గతంగా అంటరానితనాన్ని పాటిస్తూ, బ్రహ్మణత్వాన్ని పాటించాడు. మరోవైపు అంతర్గతంగా స్త్రీ పట్ల మూర్ఖత్వాన్ని చూపిస్తుంటాడు. చంద్రి నిష్కల్మషమైన మనస్తత్వం కలిగింది అంటూ, ఆమె గుణగణాలు భార్య భగీరథితో చెబుతాడు. చెంద్రి, నారాయణప్ప దహన సంస్కారాలకు తన దగ్గర ఉన్న బంగారం అంతా ఇచ్చినప్పుడు, చంద్రి ఔదార్యాన్ని ప్రశంసిస్తూ, బంగారాన్ని ఆమెకు ఇచ్చి, తన జీవనాధార ఖర్చుల నిమిత్తం వాడుకోమని చెబుతాడు. మరోవైపు ఈ బంగారం, దహన సంస్కారాల సమస్యను పరిష్కారం చేయదని, ఆపద్ధర్మం ప్రకారం నడుచుకోవడం బ్రాహ్మణుల కర్తవ్యం అని చెబుతాడు. బ్రాహ్మణత్వం కంటే మానవత్వం గొప్పదని, చేతల ద్వారా వ్యక్తమవుతున్నా, బహిరంగంగా మాత్రం బ్రాహ్మణత్వాన్నే ప్రదర్శిస్తుంటాడు.

**"మీ ఆహారం స్వీకరించడానికి నాకేం అభ్యంతరం లేదు కానీ మా అగ్రహారప్పు వెదవలకెవరికైనా తెలిస్తే నా బ్రాహ్మణార్థానికి తిలోదకాలు ఇప్పిస్తారు కదా" (పుట :51)** అని దాసాచారి అంటాడు.

దాసాచారి మంజయ్యతో తన ఆకలిని ప్రకటిస్తూ, మరోవైపు భయాన్ని ప్రదర్శిస్తాడు. బ్రాహ్మణత్వంలో కొన్ని నియమాలు, ఆచారాలు ఎందుకు పాటిస్తున్నారు? ఎందుకు పాటించాలి? దానిలో శాస్త్రీయత ఏంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోకుండా, కేవలం సమాజం పట్ల ఉన్న భయమే వారిలో కనిపిస్తుంది.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60

నారాయణప్ప శివమొగ్గ నుంచి రావడంతోనే ప్లేగు వ్యాధితో వస్తాడు. ఆ వ్యాధితోనే చనిపోతాడు. ప్లేగు అంటువ్యాధి. అది అగ్రహారంలో దావానలంలా వ్యాపించి, క్రమక్రమంగా మనుష్యులు చనిపోతారు. శవాలు ఊళ్లో ఉండడంతో రాబందులు, గద్దలు ఇళ్లపై తిరుగాడతాయి. వాటిని చూసి ప్రజలు, ఊరికి ఏదో అరిష్టం, కీడు కలిగిందని భయభ్రాంతులకు లోనవుతారు. కానీ మూల కారణాలను తెలుసుకోవాలనే స్పృహ ఎవరిలోనూ ఉండదు. మూఢనమ్మకాలను విశ్వసిస్తూ, మూర్ఖత్వంతో వ్యవహరిస్తుంటారు.

లక్ష్మీదేవమ్మ ఒక బాల వితంతువు. చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోవడం, బాల్యంలోనే వివాహం జరిగి భర్త చనిపోవడం, తర్వాత అత్త మామలు చనిపోవడంతో అందరూ ఆమెను అగ్రహారంలో అశుభ సూచకంగా భావిస్తారు. ఆమెను మొదట్లో నారాయణప్ప తండ్రి అక్కున చేర్చుకుని, ఆమె పోషణ, ఆస్తి వ్యవహారాలు చూసుకుంటాడు. నారాయణప్ప తండ్రి మరణంతో, ఆమె ఆస్తి అంతా గరుడాచారి చేతిలోకి వస్తుంది. గరుడాచారి ఆమె ఆస్తిని స్వాధీనం చేసుకొని, లక్ష్మీదేవమ్మకి నిలువ, నీడ లేకుండా చేస్తాడు. దాంతో ఆమె మానసిక స్థితి సరిగా లేక పిచ్చిదానిలా వ్యవహరిస్తుంది. దాంతో అందరూ లక్ష్మీదేవమ్మకు దయ్యం పట్టిందని విశ్వసిస్తారు. ఈ పాత్ర ద్వారా స్త్రీ పై ఆర్థిక దోపిడీ ఎలా జరుగుతుందో? రచయిత తెలియజేశారు.

చంద్రి తన కొరకు అగ్రహారంలో అందరి చేత వెలివేయబడ్డ నారాయణప్ప శవాన్ని దహనం చేయాలనుకుంటుంది. అటువంటి సందర్భంలో "**అక్కడ శవం కుళ్ళుతోంది, అది తాను వలచిన నారాయణప్ప కాదు, బ్రాహ్మణుడు కాదు, శూద్రుడు కాదు, శవం.**" **(పుట:61)** అని చెంద్రీ అంటుంది.

నారాయణప్పతో ఇంతకాలం జీవితాన్ని పంచుకున్నందుకు, తనకు సమాజంలో ఎటువంటి గౌరవం, గుర్తింపు లేకపోయినా, రక్తసంబంధికుల కంటే ఎంతో గొప్పగా ఆలోచించి, శవాన్ని దహనం చేయించింది. మానవీయత అనేది కులాన్ని బట్టి రాదు అని, కులం కంటే గుణం ప్రధానమని చంద్రి నిరూపించింది.

"**ఒకప్పుడు చేతిలో డబ్బులు లేకపోతే, ఎడ్లని కొనుక్కోవడానికి బాకీ ఇచ్చిన మహానుభావుడు ఆయన**" **(పుట: 61)** అని చేపల వ్యాపారం చేసే అహమ్మద్ బ్యారి అంటాడు. అంటే నారాయణప్ప తనకి చేసిన మేలుని తలుచుకుంటూ, భయం లేకుండా, అతని శవాన్ని చంద్రితో కలిసి దహనం చేస్తాడు. ఈ సంఘటనని గమనిస్తే నారాయణప్ప వ్యక్తిత్వం చాలా గొప్పదని, తనకు చేతనైనంతలో ఇతరులకు సాయం చేసే తత్వం అని అర్థమవుతుంది. అతని దహన సంస్కారాలను కులం వ్యతిరేకించిన, అతనిలో ఉన్న వ్యక్తిత్వమే, అతని మీద గౌరవం, అభిమానం కలిగేలా చేసి, ధైర్యంగా ముందుకు వచ్చి, ఇతర కులస్తుల చేత దహన సంస్కారాలను చేయించుకునేలా చేసింది.

చంద్రి, బెల్లి అనే స్త్రీ పాత్రలు వేశ్యలు అయినప్పటికీ, వారికి ఒక ధర్మం, న్యాయం ఉంటుంది అనేలా వారి పాత్రలు మనకు దర్శనమిస్తాయి. ఆ పాత్రలు ఎటువంటి మాలిన్యం లేకుండా స్వచ్ఛంగా, మానవీయతకు నిలువెత్తు నిదర్శనంలా కనిపిస్తాయి.

ప్రాణేశాచార్య జీవితం చంద్రికి ముందు, చంద్రికి తర్వాత అన్నట్లుగా అనూహ్యమైన మార్పులు తన జీవితంలో చోటు చేసుకుంటాయి. ప్రాణేశాచార్య అంత కఠినంగా, తన వ్యక్తిత్వాన్ని నొక్కిపెట్టి, అన్నింటినీ త్యజించి, నిర్జీవంగా ఎందుకు జీవితాన్ని గడుపుతున్నాడో? దానికి గల కారణాలను విశ్లేషించుకుంటాడు. ప్రాణేశాచార్యకు జీవితంలో మరో కోణాన్ని పరిచయం చేసింది మాలేరుల పుట్ట. అతనితో స్నేహం చేయటం వల్ల, జీవితంలోని లోతుని, ఆనందాన్ని చవి చూడగలిగాడు. మొదటిసారిగా పుట్ట వ్యక్తిత్వాన్ని చూసి, అతని జీవన శైలిని చూసి ప్రాణేశాచార్యకు అసూయ కలిగింది. మనసుకు నచ్చినట్టు జీవించగలగటంలోనే అసలైన ఆనందం ఉంది అనే విషయాన్ని గ్రహిస్తాడు. నవలలో మేళి రథోత్సవం సందర్భంగా, అక్కడక్కడ కన్నడ సాంప్రదాయాలు, కన్నడ జానపద కళారూపం దొమ్మరాట గురించి రచయిత ప్రస్తావించారు.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60

నవలలో మఠాధిపతుల తీరు తెన్నులు, ఆధిపత్యం కోసం పోరాటం వంటి అనేక సామాజిక సమస్యలు కనిపిస్తాయి. ప్రాణేశాచార్యులకు చంద్రి, పుట్టలతో కలిగిన సాన్నిహిత్యం వల్ల అంతరంగిక సంఘర్షణ మొదలవుతుంది. దుర్వాసపురం వెళ్లి జరిగినదంతా చెప్పి, తనకు నచ్చినట్లుగా జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొని, ప్రయాణం ప్రారంభిస్తారు అక్కడితో ఈ నవల ముగుస్తుంది.

**ముగింపు:** కన్నడ రచయిత యు.ఆర్.అనంతమూర్తి నవల సంస్కార రచయిత లక్ష్యాన్ని, రచయిత ఆశించిన ప్రయోజనాన్ని సాధించింది. నవలలో ఎన్నో సామాజిక అంశాలను ప్రతిఫలింపజేస్తూ, ఆ అంశాలన్నీ ఒక వ్యక్తి అంతర్మథనానికి ఎలా కారణాలు అయ్యాయో? రచయిత నవలలో తెలియజేసిన తీరు బావుంది. ముఖ్యంగా రచయిత బ్రాహ్మణుడు అయినప్పటికీ, తన సామాజిక నేపథ్యంలో జరిగిన అనేక సంఘటనలను, ఎంతో నిర్భయంగా, నిర్మోహమాటంగా చెప్పగలగటం రచయిత ధైర్యానికి, నిజాయితీకి నిదర్శనమని చెప్పుకోవాలి. ఏ రచయిత అయినా తాను చూసి , అనుభవించిన జీవితాన్ని వస్తువుగా తీసుకుని ఇతివృత్తంగా మలిచినప్పుడే, ఆ రచనలో జీవత్వం ఉట్టి పడుతుంది. రచయిత తనకు తెలిసిన జీవితాన్ని ఆవిష్కరించినప్పుడే ఆ సాహిత్యం చిరస్థాయిలో నిలిచిపోతుంది. రచయిత ఆశించిన సామాజిక ప్రయోజనాన్ని చేరుకోగలుగుతుందని బలంగా నమ్మి, ఆ సిద్ధాంతానికి కట్టుబడే రచయిత యు.ఆర్. అనంతమూర్తి. తనకు తెలిసిన, తాను అనుభవించిన బ్రాహ్మణుల జీవితమే కథా వస్తువుగా మారింది. రచయిత చుట్టూ అల్లుకున్న సామాజిక వాతావరణాన్నే ఇతివృత్తంగా తీసుకున్నారు. అంతేకాని బ్రహ్మణత్వానికి వ్యతిరేంగానో, విరుద్ధంగానో రాయటం రచయిత ఉద్దేశం కాదు. కేవలం వాస్తవిక కథనం మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు.

నవలలో అక్కడక్కడ స్త్రీ పాత్రల వర్ణనలు, మనస్తత్వాలు కొంత అసహజంగా, అశ్లీలంగా అనిపించాయి. కొన్నిచోట్ల వాక్య ప్రయోగాలు అసందర్భంగా, అర్థరహితంగా ఉన్నాయి. అయినప్పటికీ సామాజిక కోణంలో కన్నడ బ్రాహ్మణుల జీవితాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. కులం, మతం, వర్గం ఏదైనా మానవీయ విలువలతో జీవించడమే ప్రధానం అని ఈ నవల ద్వారా రచయిత యు.ఆర్. అనంతమూర్తి గారు సమాజానికి సందేశాన్ని అందించారు.

**ముగింపు:** కన్నడ రచయిత యు. ఆర్ అనంతమూర్తి నవల సంస్కార రచయిత లక్ష్యాన్ని, రచయిత ఆశించిన ప్రయోజనాన్ని సాధించింది. నవలలో ఎన్నో సామాజిక అంశాలను ప్రతిఫలింపజేస్తూ, ఆ అంశాలన్నీ ఒక వ్యక్తి అంతర్మథనానికి ఎలా కారణాలు అయ్యాయో ? రచయిత నవలలో తెలియజేసిన తీరు బావుంది. ముఖ్యంగా రచయిత బ్రాహ్మణుడు అయినప్పటికీ, తన సామాజిక నేపథ్యంలో జరిగిన అనేక సంఘటనలను, ఎంతో నిర్భయంగా, నిర్మోహమాటంగా చెప్పగలగటం రచయిత ధైర్యానికి, నిజాయితీకి నిదర్శనమని చెప్పుకోవాలి. సామాజిక కోణంలో కన్నడ బ్రాహ్మణుల జీవితాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. కులం, మతం, వర్గం ఏదైనా మానవీయ విలువలతో జీవించడమే ప్రధానం అని ఈ నవల ద్వారా రచయిత యు. ఆర్. అనంతమూర్తి గారు సమాజానికి సందేశాన్ని అందించారు.

**ఆధార గ్రంథాలు:**

అనంత మూర్తి, యు. ఆర్. కన్నడ మూలం (సంస్కార), సుజాత, పట్వారి. తెలుగు అనువాదం ( సంస్కారం), మొదటి ముద్రణ డిసెంబర్ 2006: హైదరాబాద్.

వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. *కథాశిల్పం*, ప్రథమ ముద్రణ (జనవరి,1995), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 54-60